# మంత్రగాడు

[కథానిక]

= శ్రీ కొడవటిగంటి కుటుంబరావు =

## ౧

ఆ కొండలమీద విషపు పాములు జాస్తి. ఏటా అయిదారు వేలమంది పాము కాటుతో చస్తూఉంటారు. అప్పుడప్పుడూ కొందరు ఉద్రేకం గల కుర్రవాళ్లు పాముల వేటకు బయల్దేరి సామాన్యంగా ఇళ్లకు తిరిగి రారు.

ఆప్రాంతాల మంత్రాలు వేసి పాము కాట్లు నయంచేసేవాళ్లున్నారుగాని, నిజంగా పామువిషం శరీరంలో ప్రవేశించిన తరవాత మంత్రం ఏమీ చెయ్యలేదు. అదృష్టవశాత్తూ నూటికి ఎనభై పాముకాట్లు గోరుగిచ్చులవంటివి. అటువంటి కాట్లమీద ఏమంత్రమైనా అమోఘంగా పనిచేస్తుంది.

అర్జునుడు పద్ధెనిమిది, పంధొమ్మిదేళ్ల కుర్రవాడు; అందగాడు; కష్టపడి పనిచేసేవాడు; చాలా పట్టుదలా, న్యాయబుద్ధీ కలవాడు. వాడు పసివాడై ఉండగా వాడి అన్న పాముకాటుతో చచ్చిపోయినాడు. ఇటీవల వాడి తల్లిదండ్రు లిద్దరూ నెలరోజులు తేడాగా పాములవాత పడ్డారు.

వాడికి మొదటినించీ పాము లంటే ప్రీతి. ఎన్నడూ వాటి జోలికి పోయి ఎరగడు. తోటి కుర్రాళ్లు పాముల వేటకు బయల్దేరుతుంటే ఏదో సాకు చెప్పి వాళ్లవెంట వెళ్లకుండా.తప్పించుకునేవాడు. తను ఒంటరిగా వుండగా పాము కంటబడితే ఏమీచేసేవాడు కాడు.

ఒకసారి అర్జునుడు నలుగురు స్నేహితులతో పొద్దూకేవేళకు ఇళ్లకు తిరిగివస్తుండగా దారిలో ఒక బూడిదరంగు పాముపిల్ల-మూరెడు పొడుగుది - దారిపక్కన ఉన్న ఒక దుబ్బులోకి పోతూ కనిపించింది.

వెంటనే నలుగురు కుర్రాళ్లూ దుబ్బును కమ్ముకుని కర్రలతో దుబ్బును నాలుగువేపులా అదిలించారు. పాము బయటికి రాగానే నాలుగు కర్రలూ నడుముమీద పడినై. అప్పుడా క్షుద్రప్రాణి తలఎత్తి నలుగురికేసీ చూసింది. అది నలుగురి మొహాలూ గుర్తుంచుకుని దేవుడిదగ్గిర వర్ణించటానికే ప్రయత్నిస్తున్నదో, “నేను మీ కేంచేశాను ? నా ప్రాణంతో మీ రేం చేసుకుంటారు?” అని వాళ్లని అడుగుతున్నదో అర్జునుడికి అర్థం కాలేదు. అది తన చిన్నకళ్లతో ఒకర్ని తరవాత ఒకర్నిచూసి ఏమీ అనకపోవటం చూస్తుంటే అర్జునుడికడుపు తరుక్కుపోయింది. దాన్ని పూర్తిగా చంపక వినోదం చూస్తున్న

క్షుద్రాల్లే విషసర్పాలో, వాళ్లచేత నడుంవిరగగొట్టించుకున్న ఆక్షుద్రప్రాణే విషసర్పమో వాడి కర్థంకాలేదు. వాడు చప్పున ముందుకొచ్చి తన లావుపాటి కర్రతో దాని తల చితకపొడిచేశాడు.

ఇది జరిగిన మూడురోజులదాకా అర్జునుడికి ఆ సీరెండలో ఆపాముచూపే జ్ఞాపకం వచ్చి రొమ్ముల్లో బిగబట్టినట్టుండేది.

పాము మనిషిని చంపటంలోనూ, మనిషి పామును చంపటంలోనూ తేడా ఏమిటి? పాము మనిషినించి తప్పించుకుపోవటానికే ప్రయత్నిస్తుంది. మనిషి పామును చంపటానికే చూస్తుంటాడు. ఎట్లాగో చచ్చే మనిషి పాముకాటువల్ల చస్తేమాత్రమేం? మనిషిచేత పడకపోతే పాముకు చావు లేదు. అది ఎన్నివందల ఏళ్లన్నా బతుకుతుంది.

౨

ఇటువంటి వేదాంతం అవలంబించిన అర్జునుడు తల్లిచావుతో పూర్తిగా మారిపోయినాడు. పాములూ మనుష్యులవంటి ప్రాణులే అనే తత్వం వాడికి తప్పుగా తోచింది. అవి మరోజాతి. కనకనే దేవుడు వాటికీ, మనుష్యులకూ వైరం పెట్టాడు. మనుష్యులూ, పాములూ ఒకరి ప్రాణం ఒకరు తీసుకోవటానికి పుట్టారు. పాములుమాత్రమే మనుష్యులనుచంపుతూ మనుష్యులు పాముల జోలికి పోవటం మానితే ప్రపంచంలో మనుష్యులు లేకుండాపోయి పాములే మిగులుతై... అదీకాక తల్లి లేకపోవటం ఏమిటో పాము కేం తెలుసు? పాములు తమ తల్లులు చచ్చిపోతే వాటికోసం రాత్రిళ్లు నిద్రపోకుండా ఏడవగలవా? అటువంటి తుచ్ఛప్రాణాలుంటేనేం, పోతేనేం? ఈ కొండలమీద ఒక్క పాముకూడా లేకుండాపోతే జీవితం ఎంత ఆనందంగా ఉంటుంది! ప్రపంచం స్వర్గమైపోదూ?

ఆలోచించినకొద్దీ అర్జునుడికి పాముల్ని నిర్మూలించటం సాధ్యంగానే కనిపించింది. ఇది ఒక మనిషి జీవితం యావత్తూ ధారపొయ్యదగిన పని. దీనికి తోడుకూడా అక్కర్లేదు. నలుగురు కలిసి చంపేది ఒక్కొక్క పామునే. అందులో ఎవడన్నా అజాగర్త మనిషి ఉంటే వాడి కేమన్నా జరగ్గానే మిగిలినవాళ్లందరికీ నిరుత్సాహం కలుగుతుంది. కనక ఈ పనికి తను స్వయంగా, ఒంటరిగా పూనుకోవాలి.

అర్జునుడు తన సొంతపన్లమీద విరక్తి పుట్టి ఉదయంలేచిందిలగాయతూ పొద్దూకేవరకూ పాములవేట ప్రారంభించాడు. వాడు పాములమీద పట్టిన పగ ఏపామూ ఎవడిమీదా పట్టిఉండదు. రోజుకు అధమం నాలుగైదు పాముల్నన్నా కొట్టంపి ఇంటి కొచ్చేవాడు కాడు. ఒక్కోరోజు పదిపన్నెండు పాముల్నికూడా పొట్టన పెట్టుకునేవాడు. ఆ రోజుకారోజు వాడికి పాములమీద పగ జాస్తిఅయిందిగాని తగ్గలేదు.

చిత్ర మేమిటంటే వాడీపాములవేట మొదలుపెట్టినతరవాత వాడికి పాములమీద ఎంత అసహ్యం ఏర్పడిందో మనుష్యులమీదా అంత అసహ్యం ఏర్పడింది. ప్రతి మనిషీ జానెడు బెత్తెడు పురుగుకు లోకువగా కనిపించాడు. తను ఒక్కడే వాటికి నిజమైన మొగుడు. సరిగా తిండీ, పోషణా లేక తనకు పిశాచపుమొహం పడుతున్నా తన జీవితమే

వాడికి వ్యర్థజీవితం కానట్టూ, మిగిలిన మానవజీవితా లన్నీ వ్యర్థజీవితా లయినట్టూ తోచింది.

ఈ మనస్థితి జబ్బుతో కూడుకున్న దనీ, తాత్కాలికమైనదనీ అర్జునుడు కనిపెట్ట లేదు.

౩

ఆ మంత్రగాడు చాలా దూరదేశం నించి వస్తున్నాడు. వాడి కీ ప్రాంతాలు కొత్త. వాడు ఉంటూ వచ్చిన దేశంలో మంత్రగాళ్లకు బతుకుతెరువు లేకుండా పోతున్నది. వాడు కేవలం మంత్రాలే కాక కొన్నికొన్ని మాయలుకూడా నేర్చిన వాడు కావటంవల్ల అక్కడివాళ్లు వాడి మీద కక్షకట్టి వాడికి చోటు లేకుండా చెయ్యటానికి ఉపక్రమించారు. మంత్రగాడు బతకనేర్చినవాడు కనక పెందలాడే తన కూతురిని వెంటబెట్టుకుని మకాం ఎత్తాడు.

మంత్రగాడూ, వాడి కూతురూ ఎన్నో వారాలు ప్రయాణంచేశారు. ఎన్నో ఊళ్లూ, దేశాలూ, నదులూ, కొండలూ దాటారు. కాని వాళ్లకి ఎక్కడ నిలిచిపోవటానికీ మనస్కరించలేదు. ఆఖరుకు ఈ ప్రాంతపు కొండలమీదికి రాగానే మంత్రగాడి కూతురు ప్రాణం లేచివచ్చినట్టయింది. ఆమె ఉల్లాసానికి అక్కడి ప్రకృతిసౌందర్యమే కారణమో, లేక అప్పుడే ప్రారంభ మవుతూన్న వసంత శోభే కారణమో తెలీదు. కాని మంత్రగాడు ఈ ప్రాంతాల కొంతకాలం ఉండిపోవటానికి తన మనస్సులో ఒక తాత్కాలికతీర్మానం చేసుకున్నాడు.

ఒకనాటి మిట్టమధ్యాహ్నంవేళ తండ్రికూతు ళ్లిద్దరూ ఒక నీటిమడుగుదగ్గిర రొట్టెలు తిని నీళ్లు తాగి చెట్లనీడన విశ్రమించారు. త్వరలోనే మంత్రగాడికి కాస్త కునుకుపట్టింది. వాడి కూతురు మటుకు ఏమాత్రమూ అలసత తోచక సన్నగా పాడుకుంటూ రాళ్లగుట్టలు ఎక్కిదిగటం మొదలుపెట్టింది.

అకస్మాత్తుగా పాట ఆపి ఆపిల్ల తన కళ్లను తానే నమ్మలేనట్టు చూడసాగింది. అంతదూరాన ఒక పెద్ద బండరాయి నీడలో ఒకకుర్రవాడు నిద్రపోతున్నట్టు పడిఉన్నాడు. ఆపిల్ల గబగబా రాళ్లమీద గెంతుకుంటూ కుర్రవాణ్ణి సమీపించింది. దగ్గరనించి చూస్తే అతని నోటివెంట నురుగు కనిపించింది. అతని రొమ్ము నిశ్చలంగా ఉంది. తాకిచూస్తే అతని శరీరం మంచుకుండ మాదిరిగా ఉంది.

ఆపిల్ల అతన్ని భుజం పట్టుకుని కదిలించింది. అతని పెదిమలమధ్యగా మరికొంచెం నురుగు వచ్చింది గాని ఇంకేమీ కాలేదు. అతని మొహంగాని, శరీరంగాని వివర్ణం కాలేదు.

౪

అర్జునుడు కళ్లు తెరిచి చూసేటప్పటికి అతనికి ఒక గడ్డంవాడి మొహమూ, ఒక పడుచుపిల్ల మొహమూ కనిపించినై.

"ఏం జరిగింది? నే నెక్కడున్నాను?... నన్ను పురుగు ముట్టింది!" అన్నా డర్జునుడు.

"నీ కేమీ భరవాలేదు. మానాన్న నిన్ను బతికించాడు!" అన్నది మంత్రగాడి కూతురు.

"నీ కేమీ ప్రాణభయం లేదు. మీ యిల్లెక్కడ?" అన్నాడు మంత్రగాడు.

"నా కిల్లూ వాకిలీ ఏమీ లేదు. నా కెవరూ లేరు... మీరిద్దరూ నన్ను బతికించారా? నాకు ప్రాణదానం చేశారా? మీ రుణం ఎట్లా తీర్చుకోగలను?" అన్నాడర్జునుడు.

మంత్రగాడి మొహాన ఆశాభంగం కనిపించింది.

"పోనీ ఈప్రాంతాల గొప్పవాళ్ల నెవరినన్నా ఎరుగుదువా?" అన్నాడు మంత్రగాడు.

"గొప్పవాళ్లెవరో నాకు తెలీదు. కాని ఇక్కడ అందర్నీ ఎరుగుదును ... నాకు ప్రాణదానం చేసిన దేవుడివి! నేను నీరుణం ఎట్లా తీర్చుకోను? ఈక్షణం లగాయతూ నేను తీసి విడిచే ప్రతిశ్వాసా మీదే! నాఒంటో ఉన్న శక్తిలో ప్రతి అణువూ మీదే! నన్ను మీయిష్టం వచ్చినట్టు ఆజ్ఞాపించండి!" అన్నాడర్జునుడు.

మంత్రగాడాలోచించాడు. అంతకు పూర్వం తనవల్ల లాభాలు పొందామని నమ్మినవాళ్లు చాలామంది ఉన్నారుగాని తన కింతగా కృతజ్ఞత కనబరిచినవాళ్లెవరూ లేరు.

"పోనీ, పాపం, నీ కిల్లూ వాకిలీ తల్లీ తోడూ లేరంటున్నావుగనక నావెంటే ఉండు. నాకు తోడుగా ఉందువుగాని!" అన్నాడు మంత్రగాడు.

అర్జునుడు మంత్రగాడి కాళ్లమీద పడ్డాడు. వాడి కీప్రపంచంలో ఈమంత్రగాడుతప్ప ఇంకెవ్వరూ లేరనిపించింది. చచ్చిపోయిన తన తల్లీ, తండ్రీ, తనచేత చచ్చిన పాములూ పూర్వజన్మకు చెందినవిగా తోచినై. వాడు మంత్రగాడి వెంట ఉండటానికి సమ్మతించాడు.

మంత్రగాడు ఆప్రాంతాలనే బిచాణా వేశాడు. అర్జునుడు తన కొత్తయజమానిని ఆ పరిసరాల పదిమైళ్లలోపుగా ఉన్న ప్రతి మనిషికీ పరిచయం చేశాడు. మంత్రగాడి మహత్యంలో అందరికీ విశ్వాసం కలిగింది. చచ్చిపోయిన అర్జునుణ్ణి మంత్రగాడు మరి బతికించలా?

అర్జునుడు మంత్రగాడికి సకలోపచారాలు చేసేవాడు. ఇంటిపని యావత్తూ చేసేవాడు, వంటచేసేవాడు, కట్టెలు కొట్టేవాడు, మందులు నూరేవాడు, ఒళ్లు పట్టేవాడు. ఈ చాకిరిలో తన శరీరం ఎంత హూనమవుతుంటే అర్జునుడి కంత ఆనందంగా ఉండేది.

తన యజమానిమాయలనుగురించి అర్జునుడు చాలాకాలం తెలుసుకోలేదు. మంత్రగాడిమీద తనకు మొట్టమొదటి సందేహం కలిగినప్పుడు దాన్ని చప్పున అణుచుకున్నాడు. సందేహం రూఢి అయినతరవాత తన ప్రాణదాతను విమర్శించటం తన ధర్మం కాదనుకున్నాడు.

క్రమంగా మంత్రగాడిలో ఉన్న మహత్యం యావత్తూ మాయేనని తెలిసిపోయినప్పుడు అర్జునుడి కాశ్చర్యం కలిగింది. ఈమాయలవాడు తనను చావునించి ఎట్లా తప్పించాడు? తనమీద పారిన మంత్రం ఇతరులు కొందరిమీద పారటం లేదెందుకు?

ఈమంత్రగాడిమీద ఆప్రాంతాలవాళ్ల కింకా గురితగ్గలేదు. అక్కడి మంత్రగాళ్లు కూడా ఈమంత్రగాడి కింకా దాసోహమంటున్నారు. దానికి కారణం మరేమీ లేదు—అక్కడి మంత్రగాళ్లు ఈమంత్రగాడి మాదిరిగా మాయలెరగరు.

ఈమాయలు సాధించటానికి మంత్రగాడు అర్జునుణ్ణి సాధనంగా వినియోగించసాగాడు. అర్జునుడి అంతరాత్మ ఆపన్లు చెయ్యటానికి ఎదురు తిరిగింది.

కాని, నేను చెయ్యననటానికి తన కేమి హక్కుంది? తన ప్రాణమూ, శరీరమూ—సమస్తానికీ తన యజమానేగా అధిపతి?... ఆమాట అని ఈమంత్రగాడికోసం తన కయినవాళ్లందరిమీదా తను అత్యాచారం చెయ్యటం ఎట్లా?

ఈసమస్య అర్జునుడికి తేలలేదు. కాని అర్జునుడు మంత్రగాడిమీద తిరుగుబాటు చెయ్యక వాడు చెప్పినదల్లా అమిత అయిష్టంగా చేస్తూవచ్చాడు. ఇప్పుడు అర్జునుడు యజమానికి చేసే సేవ హృదయపూర్వకమైనది కాదు.

మొదట్లో మంత్రగాణ్ణి దేవుడల్లే చూసిన జనం ఏకారణంచేతనో ఇప్పుడు వాడంటే దడుచుకుంటున్నారు. వాడికి కోపం తెప్పించినవాళ్ల ఇళ్లు కాలిపొయ్యేవి. వాళ్ల పశువులు మాయమైపోయి, వాటితాలూకు కళేబరాలు ఎక్కడో కనిపించేవి. అక్కడక్కడా మనుష్యులు ఆశ్చర్యకరమైన చావులు చస్తున్నట్టుకూడా ఒక పుకారు పుట్టింది.

అర్జునుడితోకూడా పూర్వపరిచితులు వెనకటంత చనువుగా మాట్లాట్టం లేదు. వాణ్ణి చూసీ భయపడ్డట్టు కనిపిస్తున్నారు. ఒకరిద్దరు మంత్రగాణ్ణిగురించి వాడితో చెప్పుకుని ఏడిచినప్పుడు అర్జునుడి గుండె అవిసిపోయింది.

తన మూలంగానే ఈమంత్రగాడి కీప్రదేశంలో స్థావరం చిక్కింది. వీణ్ణి అందరికీ పరిచయంచేసినవాడూ తనే. వీడిప్పుడు ప్రజలమీద ప్రయోగిస్తున్న మహాశక్తికి మూలకారణంకూడా తనే. మహామారి వస్తే జనం ఎట్లా ఖిన్నులైపోతారో అట్లా వున్నారు మంత్రగాడిమూలాన ప్రజలు.

తన పునర్జన్మ ఇంత తుచ్ఛపుజన్మ అయిందేం? ఈపరిస్థితుల్లో తన ధర్మం ఏమిటి? తనను ఈసంఘం కోల్పోయింది. తను సాతూత్తూ చచ్చిపోయినాడు. ఇప్పుడు బతికున్నతను సంపూర్ణంగా మంత్రగాడి సొత్తు.

"నాతో ఏమీ చెప్పకండి. నేను వెనకటి అర్జునుణ్ణిగాను. మంత్రగాడే నాప్రాణాధిదేవత, నాయజమాని. ఆయనమీద ఎటువంటి అపనిందలూ నాచెవిన పడరాదు" అని తనతో మాట్లాడినవాళ్లకు సమాధానం చెప్పా డర్జునుడు.

## ౬

ఈలోపుగా అర్జునుడి జీవితంలో మరో ప్రతిబంధకం ఏర్పడ్డది. మంత్రగాడికూతురు అర్జునుణ్ణి మోహించింది. వాడి ప్రేమను ఆజ్ఞాపించింది. అర్జునుడు ఆపిల్లను మోహించలేదు. కాని మంత్రగాడి ఆజ్ఞలు శిరసావహించినట్టే ఆమెఆజ్ఞలూ శిరసావహించాడు.

ఆపిల్ల ప్రణయం బహుచిత్రంగా ఉండేది. ఆమెకు అంతలో కోపం వచ్చేది, అంతలో జాలి కలిగేది, అంతలో కామోద్రేకం కలిగేది, అంతలోనే విరక్తీ కలిగేది! ఆమె వాణ్ణి ఆధారంచేసుకుని కామతృప్తి కలిగించుకున్నప్పుడైనా ఆమెమోహం పగమాదిరిగా ఉండేదిగాని ప్రేమమాదిరిగా ఉండేదికాదు. ఆమె తనను ఆలింగనం చేసుకున్నా, చెంపమీద కొట్టినా, తనతో గంటలకొద్దీ మాట్లాడకుండా కూర్చున్నా, గంటలతరబడి తనతో సోది చెప్పినా అర్జునుడికి తేడా లేనట్టే ఉండేది. ఆమెవికారాలు అర్జునుడి ఆత్మలో ఎటువంటి చైతన్యమూ కలిగించలేకపోయేవి.

అదీకాక అర్జునుడి ప్రాణం ఆ పాములవాడికూతురు - ఆగుడ్డిపిల్లమీద ఉంటూ వచ్చింది. దాన్ని వాడు చాలా పసితనంనించీ ఎరుగును. వాడి జన్మకు ప్రణయం అదే. అది, పాపం, కళ్లులేని పిల్ల. దాన్ని చూసినప్పుడు ఎవడి గుండెగాని కరగకుండా ఎట్లా ఉంటుంది? అది ఎవర్నీ ఒక పౌరుషమైన మాట అని ఎరగదు. దాన్ని చెయ్యిపట్టుకుని చెట్లమధ్యగా నడిపించటంకన్న ఆనందం ఏమిటో అర్జును డూహించలేకపోయినాడు. నువు ముళ్లకంచెల్లోకి తీసుకుపోయినా ఒప్పుకున్నదానికంటె నీకు దగ్గిర మనిషి ఎవరు? నువు తనకు ఎటువంటి ఆపదా కలక్కుండా కాపాడతావని మనస్ఫూర్తిగా నమ్మటంకంటె ఆడది నిన్నెట్లా ప్రేమించగలదు? నువు వెళ్లిపోతానంటే అది చేతివేళ్లతో నీమొహం తడివి, వర్ణించటానికి వీల్లేని విషాదకరమైన నవ్వొకటి నవ్వి మళ్లీ ఎప్పుడొస్తావు అని అడిగితే నీప్రాణం ఎట్లా తటతట్లాడుతుంది? ఏ మనిషిగాని గుడ్డిపిల్లకోసం ప్రాణా లిచ్చినట్టు రెండు కళ్లున్న మనిషికి ప్రాణం ఎట్లా ఇవ్వగలడు?

మంత్రగాడి బానిసత్వంవల్ల తన ఆత్మకు కలిగే బాధకు గుడ్డిపిల్లసావాసమే విరుగుడని పించింది అర్జునుడికి.

## ౭

మంత్రగాడి కూతురు అర్జునుణ్ణి అనుమానించసాగింది. వాడు ఉన్నట్టుండి మాయమై జాములతరబడి కనిపించక, ఎక్కణ్ణించో చాటంత మొహంతో ప్రత్యక్షమౌతాడు. వాడి మొహం అట్లా వికసించి ఉండటం చూస్తే దానికి మండిపొయ్యేది. వాడి ఇష్టంలేకుండా వాడివల్ల తను ఆనందం పొందటమే ఆ పిల్ల కెక్కువ ఇష్టం. వాడి మొహాన కొంచెంగా నంతోషచ్ఛాయ కనిపిస్తే దానికి వాడిమీద చెప్పరాని అసహ్యం పుట్టేది.

వీ డెక్కడికి పోయి ఏం చేస్తున్నదీ ఆరా తియ్యాలని మంత్రగాడి కూతురుకు బాగా పుట్టింది. అది త్వరలోనే గుడ్డిపిల్ల రహస్యం కాస్తా తెలుసుకున్నది.

"నువు గుడ్డిపిల్లను చూట్టానికి మళ్లీ వెళ్లు చెబుతాను!" అన్నది మంత్రగాడి కూతురు.

అర్జునుడు దానికేసి వింతగా చూసి జవాబివ్వలేదు.

"ఈ సారి మళ్లీ దానిదగ్గిరికి పోతావా?" అన్నది మంత్రగాడి కూతురు మళ్లీ.

"పోతాను. ఏం పోతే?"

"పోయి దానితో ఏం చేస్తావు?"

"మాట్లాడతాను. దాన్ని చెయ్యి పట్టుకుని నడిపిస్తాను."

"నన్నిప్పుడు చెయ్యి పట్టుకుని నడిపించు."

మారుమాట్లాడకుండా అర్జునుడు దాన్ని చెయ్యిపట్టుకు నడిపించసాగాడు. అది అంతలో బుద్ధి చలించి, ఎంతో వికారం పుట్టించే ఆపేక్షతో, "నన్నిట్లా నడిపిస్తుంటే నీకు చాలా సంతోషంగా లేదూ?" అన్నది.

"లేదు" అన్నాడు అర్జునుడు సంగ్రహంగా.

మంత్రగాడి కూతురు చర్రున కోపం తెచ్చుకుని, "ఆగుడ్డిముండను పట్టుకుంటే ఉండే ఆనందం నన్ను పట్టుకుంటే నీకెందుకు లేదు?" అని అడిగింది.

"ఏమో! నిన్ను పట్టుకు నడిపించటం అర్థంలేదు. నీకు కళ్ళున్నైగా!" అన్నాడు అర్జునుడు.

"నువ్వింక గుడ్డిదాన్ని చూట్టానికి వీల్లేదు. అది నా ఆజ్ఞ. మా నాన్న నీ ప్రాణం రక్షించాడు. నీప్రాణమూ, శరీరమూ అన్నీ మావి!"

దాని నోటివెంట ఆమాట వింటుంటే అర్జునుడికి చెప్పరాని అసహ్యం వేసింది. అవన్నీ తను అందించిన ముక్కలే.

"ఆజ్ఞ అయితే ఏదన్నా పని చెయ్యమనాలి. ఏమీ చెయ్యవద్దనటం ఆజ్ఞ కాదు." అన్నాడు అర్జునుడు.

"ఆజ్ఞే."

"కాదు."

"అయితే 'నువ్వు గుడ్డిదానిదగ్గిరికి పోయి సుఖంగా ఉండు' అని నన్ను ఆజ్ఞాపించమన్నావా?"

"నీతో వాదించి ఏం లాభం?"

"ఆఁ? నీకళ్ళెంతనెత్తికొచ్చినై! ఎటువంటి పాపిష్ఠివేళ నీశవం నాకంటపడ్డదో గాని! ఛీ, నీమొహం చూస్తేనే అన్నం వెళ్ళుకొస్తుంది. ఫో, నాయెదట్నించి" అని మంత్రగాడి కూతురు ఈసడించుకున్నది.

౭

తన కూతురు చెప్పిన చాడీలన్నీ విన్నమీదట మంత్రగాడికి మహాకోపం వచ్చింది. వాడు అర్జునుణ్ణి పట్టుకుని ఝాడించేశాడు.

"నేను నీప్రాణదానం చేశానని నీకింకా కృతజ్ఞత ఉన్నదనుకున్నాను. నీ అంత కృతఘ్నుణ్ణి నేనెక్కడా చూడలేదు. నీకు నా విద్యలన్నీ చెప్పి నా అంతవాణ్ణి చేద్దామనుకున్నందుకు నాకూతుర్ని ధిక్కరించి మాట్లాడతావా? ఇంత అహంకరించి మాట్లాడటానికి నీ కూపిరి పోసిం దెవరా?" అని ఉరిమాడు మంత్రగాడు.

అర్జునుడి గుండె లవిసినై. కొంతకాలం బానిసత్వంలో ఉన్నమీదట వాడి మనోదార్ఢ్యం మట్టికొట్టుకుపోయింది. కాని వాడి అంతరాత్మ ఇంకా బొత్తిగా చచ్చిపోలేదు.

"మీరు నన్ను బతికించినప్పుడు ప్రాణంకన్న ఎక్కువయింది లేదనుకున్నాను. ఇప్పుడు చూస్తే అన్నీ ప్రాణంకన్న ఎక్కువగానే కనిపిస్తున్నై. నావాళ్ళు... నన్ను చిన్నప్పు డెత్తుకుని ఆడించినవాళ్ళు... నాకు రోగం వస్తే సేవచేసినవాళ్ళు నామూలంగా

సుఖమంటే ఏమిటో మరిచిపోయినారు. ఇదే
నా నా ప్రాణంఘనత ? నా ప్రాణం రక్షించా
మంటున్నారు. దానివల్ల నాకు బాధేగాని
సుఖం కలగలేదు. నా ప్రాణంతో మీ కేమ
న్నా ప్రయోజనం ఉంటే ఈక్షణం పుచ్చు
కోండి. లేదా నన్ను ఆరోజున కనికరించే
ప్రాణం రక్షించారుగనక అట్లాగే కనికరించి
ఇప్పుడు నన్ను వెళ్లిపోనివ్వండి. నే నెంత
ప్రయత్నించి ఏం లాభం ? మీ ఋణం ఎట్లా
గూ తీర్చుకోలేను !" అన్నా డర్జునుడు
దైన్యంతో.

మంత్రగాడు చప్పున తన వైఖరి
మార్చి, "పిచ్చివాడా, నేను నిన్ను కనికరిం
చకనా ? నీమంచికోసమే చెబుతున్నాను.
నువ్వు పొగరుగా ప్రవర్తిస్తున్నా వని కోప్ప
డ్డానుగాని నీకు బాధ కలిగించటంమటుకు
నా ఉద్దేశమా ? ను వ్వెక్కడికీ పోనక్క
ర్లేదు. నాదగ్గిరే ఉండు" అన్నాడు. తెగే
దాకా లాగటం మంచిది కాదని వా డెరు
గును.

ఆరోజు సాయంకాలం మంత్రగాడి
కూతురు, తండ్రి ఏం బోధించాడో ఏమో,
అర్జునుడితో చాలా మంచిగా "నామోహం
ఎటువంటిదో నువ్వెరగవుకదా ! నువు చచ్చి
నట్టు పడిఉండటం చూసినప్పుడే నిన్ను
మోహించాను!" అన్నది.

ఆముక్కలు పదేపదే స్మరించుకుంటూ
పడుకున్న అర్జునుడికి అర్ధరాత్రివేళ వాటి
అంతరార్థం బోధపడింది. పాముకాటుకు
తను వికారంగా అయిపోలేదు. పాము విషం
తన ఒంటో ప్రవేశించనేలేదు. నిజంగా పాము
విషంతో చచ్చినవాణ్ణి ఏఆడది మోహి
స్తుంది ? ... దొంగముండాకొడుకు. తనకు
ప్రాణదానం చేసినట్టు నటిస్తున్నాడు. తను
ఎటువంటి మాయలో చిక్కాడూ? ఈ
మంత్రగాణ్ణి ఇక్కడ ఉంచెయ్యటం తనవాళ్ల
కెంత ఉపకార మనుకున్నాడూ? ఆ ఉప
కారం ఎందుకు లభించలేదో తన కిప్పు డర్థ
మయింది.

ఇప్పుడు తన ధర్మం ఏదో అర్జునుడికి
తెలిసివచ్చింది. తనవాళ్ల కీమంత్రగాడి పీడ
వదిలించే బాధ్యత తనమీదే ఉంది...

అర్ధరాత్రివేళ "మాఁవా, మాఁవా"
అనే పిలుపు వినిపించి పాములవాడు బయటి
కొచ్చి అర్జునుణ్ణి చూసి ఆశ్చర్యపోయినాడు.

"నువు నిన్న పొద్దున పట్టిన కోడెతా
చొకసారి ఇయ్యి, మాఁవా !" అన్నా
డర్జునుడు.

పాములవాడు అర్జునుడివంక ఒకక్షణం
ప్రశ్నార్థకంగా చూసి లోపలికి పోయి
బుట్టతెచ్చి ఇచ్చాడు.

అర్జునుడు బుట్ట చంకన పెట్టుకుని తిరిగి
మంత్రగాడి ఇంటికి వచ్చేశాడు. మంత్రగాడు
గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. అర్జునుడు చేతు
లో ఉన్న బుట్ట ఎత్తుగా పట్టుకుని పైమూత
మెల్లిగా తీసి పామును అంత ఎత్తునించి
మంత్రగాడి మెడమీద పడేటట్టు జార్చి చప్పు
న బుట్ట దూరాన చెట్లలోకి విసిరేశాడు.

మరుక్షణం మంత్రగాడికి మెళుకువొచ్చిం
ది. ఏం జరిగిందీ వాడు తెలుసుకునేలోపుగా
పాము మెడమీదా, విదిలించబోతే చేతి
మీదా కాట్లేసింది.

"పురుగు, పురుగు!" అని గట్టిగా కేక వేశాడు అర్జునుడు. కర్ర తీసుకుని పారిపోతున్న పాము వెంట పడి బాదుతూ.

"ఏమి టది?" అన్నాడు మంత్రగాడు.

"ఇంకా నయం - కాటెయ్యలేదు!" అన్నాడు అర్జునుడు.

మంత్రగాడు ఖంగారుగా లేచి కూర్చుంటూ "కాటేసింది, కాటేసింది!" అన్నాడు.

"కాటేస్తేమాత్ర మేంలే! నువు పాము కాటుకు చావవుగా! ఎంత అదృష్టం!" అన్నా డర్జునుడు పామును చంపేసి ఈడ్చి పారేస్తూ.

కాని మంత్రగాడి మొహం అంతలోనే వివర్ణమయింది. వాడు గిజగిజా తన్నుకో సాగాడు.

ఈ అలజడికి లేచివచ్చిన మంత్రగాడి కూతురు తండ్రిని చూసి లబలబలాడసాగింది.

"అన్నీ తెలిసినవాడే అల్లాడిపోతున్నాడు. పురుగు ముట్టింది. ఖర్మ చాలకొస్తే ఇంతే- ఏ మంత్రాలూ అడ్డవు. చూడు, పాపం, ఎంత హైరాన పడుతున్నాడో!... అయిపోయింది." అన్నా డర్జునుడు.

వాడు తన గొంతులో ఉన్న ఆనందాన్ని దాచటానికేప్రయత్నమూ చెయ్యలేదు.

మంత్రగాడి కూతురు చర్రున ఎక్కణ్ణించో పొట్టిబాకు తీసి చెయ్యి పైకెత్తింది.

"ఆఁ! ఆఁ! అంత తొందర పనికిరాదు." అంటూ అర్జునుడు దాని చెయ్యి పట్టుకున్నాడు.

"అట్లా పెనుగులాడకు. సుకుమారి ప్రాణానివి. తగలరానిచోట మొన తగిలితే తరవాత అనుకుని లాభంలేదు. కత్తి విడిచెయ్యి." అని అర్జునుడు హితంచెబుతున్నా వినక మంత్రగాడి కూతురు తన చెయ్యి చీరుకుపొయ్యేదాకా పెనగులాడింది....

అంతటితో ఆ ప్రాంతాల మంత్రగాడి పీడ అంతమయింది. గుడ్డిదాన్ని పెళ్లిచేసుకుని అర్జునుడు సుఖంగా ఉన్నాడు.

